నేటి మ్యాచ్: అఫ్గనిస్థాన్ X దక్షిణాఫ్రికా, మ.2.30 నుంచి

ముంబై ఎదుట భారీ లక్ష్యం

నాగ్‌పూర్: రంజీ సీజన్ 2025లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఫైనల్ చేరాలంటే కొండంత లక్ష్యాన్ని కరిగించాల్సి ఉంది. నాగ్‌పూర్ వేదికగా ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆ జట్టు ఎదుట విదర్భ 406 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 292 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై 83/3గా నిలిచింది. ఆ జట్టు విజయానికి ఐదో రోజు 323 పరుగులు చేయాల్సి ఉంది. శివమ్ దూబె (12 నాటౌట్), ఆకాశ్ ఆనంద్ (27 నాటౌట్) క్రీజులో ఉన్నారు. కేరళతో జరుగుతున్న మరో సెమీస్‌లో తొలి ఇన్నింగ్స్‌లో గుజరాత్ నాలుగో రోజు ఏడు వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. కేరళ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 457 రన్స్‌కు ఆలౌట్ అవగా గుజరాత్ మరో 28 పరుగులు వెనుకబడి ఉంది.

సాత్విక్‌కు పితృవియోగం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత బ్యాడ్మింటన్ డబుల్ ప్లేయర్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. గురువారం ఉదయం సాత్విక్ తండ్రి ఆర్ కాశీ విశ్వనాథన్ (65) గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆయన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఢిల్లీలో 43వ పీఎస్‌పీబీ ఇంటర్-యూనిట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వెళ్లిన సాత్విక్.. విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన తన స్వస్థలం అమలాపురం బయల్దేరాడు.

చాహల్, ధనశ్రీ విడాకులు

ముంబై: అంతా ఊహించినట్లే జరిగింది. గత కొన్ని నెలలుగా టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్, ధనశ్రీ దంపతులు విడిపోతున్నారన్న వార్తలు నిజమయ్యాయి. గురువారం ముంబై బాంద్రాలోని ఫ్యామిలీ కోర్టుకు హాజరైన చాహల్, ధనశ్రీకి జడ్జీ విడాకులు మంజూరు చేశారు. తొలుత ఈ ఇద్దరికి 45నిమిషాల పాటు కౌన్సిలింగ్ ఇచ్చిన జడ్జీ విడిపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుపడంతో జడ్జీ విడాకులకు ఆమోదం తెలిపాడు. దీనిపై చాహల్, ధనశ్రీ తమ సోషల్‌మీడియా అకౌంట్లలో తమదైన శైలిలో రాసుకొచ్చారు. ఇదిలా ఉంటే భరణంగా ధనశ్రీకి చాహల్ 60 కోట్లు ఇచ్చే అవకాశమున్నట్లు తెలిసింది.

ఫకర్ జమాన్ ఔట్

కరాచీ: స్వదేశంలో జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీలో తొలి మ్యాచ్ ఓడి భంగపడ్డ పాకిస్థాన్‌కు భారత్‌తో కీలక పోరు ఎదుట భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్ ఫకర్ జమాన్ గాయంతో ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తుండగా అతడి కాలికి గాయమైంది. పాక్ ఛేదనలో అతడు బ్యాటింగ్‌కు వచ్చినా నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఇక ఈ టోర్నీలో ఫకర్ స్థానాన్ని పాక్.. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ ఇమామ్‌ఉల్ హక్‌తో భర్తీ చేయనుంది.

శ్రీనిధి ఎఫ్‌సీ అదుర్స్

జైపూర్: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) మళ్లీ గెలుపు బాట పట్టింది. టోర్నీలో పడుతూ లేస్తూ సాగుతున్న శ్రీనిధి టీమ్ గురువారం జరిగిన మ్యాచ్‌లో 2-1తో రాజస్థాన్ యునైటెడ్ ఎఫ్‌సీపై అద్భుత విజయం సాధించింది. శ్రీనిధి తరఫున అంజెలో ఒర్లీన్(43ని), డేవిడ్ కాస్టెండా(73ని) గోల్స్ చేయగా, మైకోల్ కాబ్రెరా(75ని)రాజస్థాన్‌కు ఏకైక గోల్ అందించాడు. ఈ విజయంలో శ్రీనిధి ప్రస్తుతం 19 పాయింట్లతో 8వ స్థానంలో కొనసాగుతున్నది.

శుభ్‌మన్ గిల్ శతకం

తొలి అడుగు ఘనంగా

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ బోణీ • బంగ్లాదేశ్‌పై ఘన విజయం • షమీకి ఐదు వికెట్లు • తౌహిద్, జకేర్ పోరాటం వృథా

గిల్ (101*)

షమీ (5/53)

లక్ష్యం మరీ పెద్దదేం కాదు. కెప్టెన్ రోహిత్ దూకుడుతో మ్యాచ్ 'ఇక ఏకపక్షమే' అనుకున్నారంతా. కానీ సారథి నిష్క్రమణ తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బంతి వేగాన్ని సైతం నియంత్రిస్తున్న మందకొడి పిచ్‌పై పరుగుల రాక కష్టమవడంతో పాటు కీలక వికెట్లు కోల్పోవడంతో ఏదో మూల ఓ సందేహం! కానీ వన్డేలలో అద్భుత ఫామ్‌లో ఉన్న గిల్ తన జోరును కొనసాగించి వరుసగా రెండో శతకంతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పడంతో చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ సేన బోణీ కొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. ఒక దశలో 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయినా తౌహిద్, జకేర్ అద్భుత పోరాటంతో భారత్ ఎదుట పోరాడగలిగే స్కోరును నిలిపింది. సీనియర్ పేసర్ మహ్మద్ షమీ.. ఐదు వికెట్లతో సత్తాచాటాడు.

దుబాయ్: ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో తొలి విఘ్నాన్ని భారత్ విజయవంతంగా దాటింది. బంతితో బంగ్లాదేశ్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేసిన టీమ్ ఇండియా.. ఛేదనలో కాస్త ఇబ్బందులు పడ్డా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (129 బంతుల్లో 101 నాటౌట్, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరోచిత శతకంతో టోర్నీలో బోణీ కొట్టింది. పునరాగమనం తర్వాత కీలక టోర్నీ ఆడుతున్న షమీ.. కీలక సమయంలో మునుపటి లయను దొరకబుచ్చుకుని ఐదు వికెట్ల (5/53)తో సత్తా చాటడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. తౌహిద్ హృదయ్ (118 బంతుల్లో 100, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకంతో మెరవగా జకేర్ అలీ (114 బంతుల్లో 68, 4 ఫోర్లు) ఆదుకోవడంతో ఆ జట్టు పోరాడగలిగే స్కోరును సాధించింది. ఛేదనను భారత్ 46.3 ఓవర్లు ఆడాల్సి వచ్చింది. గిల్‌తో పాటు సారథి రోహిత్ శర్మ (36 బంతుల్లో 41, 7 ఫోర్లు), కేఎల్ రాహుల్ (47 బంతుల్లో 41 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) రాణించారు. గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రోహిత్ దంచినా..

ఛేదనలో భారత ఇన్నింగ్స్‌ను విశ్లేషిస్తే.. కెప్టెన్ రోహిత్ ఉన్నంతసేపు ఒక ఎత్తు అయితే అతడు నిష్క్రమించాక మరో ఎత్తు అని చెప్పక తప్పదు. ముస్తాఫిజుర్ 4వ ఓవర్లో రెండు బౌండరీలతో పరుగుల వేట మొదలుపెట్టిన హిట్‌మ్యాన్ అతడే వేసిన 6వ ఓవర్లో 3 ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో గిల్ కూడా దూకుడుగా ఆడటంతో 9 ఓవర్లు ముగిసేసరికి భారత్ వికెట్ నష్టపోకుండా 69 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రెండు ఫిఫ్టీలు, ఓ శతకం బాదిన అతడు.. బంగ్లాతోనూ అదే జోరు కొనసాగించాడు. టీమ్‌ఇండియా దూకుడు చూస్తే లక్ష్యాన్ని 30 ఓవర్లలోనే పూర్తి చేస్తుందా! అనిపించింది. కానీ టస్కిన్ 10వ ఓవర్లో రోహిత్‌ను ఔట్ చేయడంతో స్కోరు వేగం ఉన్నఫళంగా నెమ్మదించింది. ఇదే సమయంలో బంగ్లా సారథి స్పిన్నర్లకు బంతినివ్వడంతో మందకొడి పిచ్‌పై పరుగుల రాకే గగనమైంది. ఎదుర్కున్న పదో బంతికి సింగిల్ తీసిన కోహ్లీ.. లెగ్‌స్పిన్నను ఎదుర్కోవడంలో తంటాలు పడ్డాడు. 38 బంతులాడిన అతడు రిషద్ 23వ ఓవర్లో సౌమ్య సర్కార్‌కు క్యాచ్ ఇచ్చాడు. కోహ్లీ, గిల్ రెండో వికెట్‌కు 77 బంతుల్లో 43 రన్స్ జోడించారు. శ్రేయస్ (15), అక్షర్ (8) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయారు.

నిలిచిన గిల్

వరుసగా వికెట్లు పడుతున్నా గిల్ వెరవలేదు. క్రీజులో పాతుకుపోయిన అతడు 69 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. వన్డే కెరీర్‌లో హాఫ్ సెంచరీకి ఇన్ని బంతులు తీసుకోవడం గిల్‌కు ఇదే ప్రథమం. బంగ్లాదేశ్ స్పిన్నర్లు భారత్‌పై ఒత్తిడి తేవాలని యత్నించినా గిల్ మాత్రం వారిని దీటుగా ఎదుర్కొన్నాడు. రాహుల్ వచ్చాక వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తుతూ ఒక్కో పరుగును కూడగడుతూ లక్ష్యాన్ని కరిగించాడు. 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను జకేర్ జారవిడవడంతో బతికిపోయిన రాహుల్ ఆ తర్వాత పట్టుదలగా ఆడాడు. తాంజిమ్ 45వ ఓవర్లో 6, 4 బాదిన అతడు.. టస్కిన్ 46వ ఓవర్లో సింగిల్ తీసి వన్డేలలో 8వ శతకాన్ని పూర్తిచేశాడు. తాంజిమ్ తర్వాతి ఓవర్లో రాహుల్ భారీ సిక్సర్ బాది లాంఛనాన్ని పూర్తిచేశాడు. రాహుల్, గిల్ ఐదో వికెట్‌కు అజేయంగా 87 పరుగులు జతచేశారు.

తౌహిద్, జకేర్ పోరాటం

35/5. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 8.4 ఓవర్లలో చేసిన స్కోరు అది. ఆరంభ ఓవర్లలోనే షమీ, హర్షిత్, అక్షర్ విజృంభణతో ఆ జట్టు కనీసం వంద పరుగులైనా చేస్తుందా? అనిపించింది. కానీ ఆ స్థితి నుంచి బంగ్లాదేశ్ 228 పరుగులు చేసిందంటే అది తౌహిద్, జకేర్ పోరాట ఫలితమే. ఆరో వికెట్‌కు ఈ ఇద్దరూ రికార్డు స్థాయిలో 154 పరుగులు జోడించి బంగ్లాను ఆదుకున్నారు. అక్షర్ 9వ ఓవర్ వరుస బంతుల్లో తాంజిద్ (25), ముష్ఫీకర్ (0)ను ఔట్ చేయగా నాలుగో బంతికి స్లిప్స్‌లో జకేర్ ఇచ్చిన క్యాచ్‌ను రోహిత్ జారవిడవడంతో లైఫ్ దొరికిన అతడు దానిని పూర్తి సద్వినియోగం చేసుకున్నాడు. రోహిత్ గనక ఈ క్యాచ్ పట్టుంటే వన్డేలలో అక్షర్ తొలి హ్యాట్రిక్ నమోదయ్యేది. తౌహిద్ కూడా కుల్దీప్ 20వ ఓవర్లో మిడాఫ్ వద్ద హార్దిక్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయాడు. భారత ఫీల్డింగ్ తప్పిదాలతో క్రీజులో నిలదొక్కుకున్న ఈ ద్వయం ఆచితూచి ఆడుతూ భారత స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంది. అయితే వికెట్‌ను కాపాడుకునే క్రమంలో ఈ ఇద్దరూ నెమ్మదిగా ఆడటంతో రన్‌రేట్ బాగా మందగించింది. 29వ ఓవర్లో ఆ జట్టు వంద పరుగుల మార్కును అందుకుంది. 87 బంతుల్లో జకేర్, 84 బంతుల్లో తౌహిద్ అర్ధ శతకాలు పూర్తిచేశాక గేర్ మార్చారు. స్కోరును పెంచే క్రమంలో జకేర్.. షమీ 43వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి లాంగాన్ వద్ద కోహ్లీకి క్యాచ్ పట్టాడు. నొప్పితోనే ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఈ 24 ఏండ్ల కుర్రాడు.. ఎట్టకేలకు తన కెరీర్‌లో తొలి శతకాన్ని నమోదుచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 49.4 ఓవర్లలో 228 ఆలౌట్ (తౌహిద్ 100, జకేర్ 68, షమీ 5/53, హర్షిత్ 3/31); **భారత్:** 46.3 ఓవర్లలో 231/4 (గిల్ 101 నాటౌట్, రోహిత్ 41, రిషద్ 2/38, టస్కిన్ 1/36)

రికార్డుల షమీ

ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన షమీ.. దానితో పాటు వన్డేలలో 200 వికెట్ల మైలురాయినీ అందుకున్నాడు. 104 ఇన్నింగ్స్‌లలో అతడు ఈ ఘనత సాధించాడు. తద్వారా మిచెల్ స్టార్క్ (102) తర్వాత సక్లయిన్ ముస్తాక్‌తో కలిసి రెండో స్థానంలో నిలిచాడు. భారత్ తరఫున అగార్కర్ (133 మ్యాచ్‌లలో) రికార్డును షమీ బ్రేక్ చేశాడు. బంతులపరంగా చూస్తే స్టార్క్ (5,240 బంతులు) కంటే షమీ (5,126) ముందున్నాడు. అంతేగాక ఐసీసీ వన్డే టోర్నీలలో షమీకి ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం ఇది ఐదో సారి. ఇది కూడా రికార్డే. ఈ జాబితాలో స్టార్క్, షాహిద్ అఫ్రిది, గ్లెన్ మెక్‌గ్రాత్.. మూడుసార్లు ఫైఫర్ సాధించారు. ఐసీసీ ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీలలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో జహీర్ ఖాన్ (59)ను షమీ (60) అధిగమించాడు.

రోహిత్ @ 11 వేలు

13 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రోహిత్ వన్డేలలో 11 వేల మైలురాయిని చేరుకున్న నాలుగో భారత క్రికెటర్ (సచిన్, కోహ్లీ, గంగూలీ ముందున్నారు)గా నిలిచాడు. 261 ఇన్నింగ్స్‌లలో రోహిత్ ఈ ఘనతను అందుకున్నాడు.

స్కూల్‌కు వెళ్తుండగా గుండెపోటు

- టెన్త్ విద్యార్థిని హఠాన్మరణం
- కామారెడ్డిలో విషాదం

శ్రీనిధి (ఫైల్)

కామారెడ్డి, ఫిబ్రవరి 20: స్కూల్‌కు వెళ్తుండగా గుండెపోటు రావడంతో ఓ విద్యార్థిని మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. రామారెడ్డి మండలం సింగరాయిపల్లికి చెందిన శ్రీనిధి (14) కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. పట్టణంలోని కల్కినగర్‌లో నివాసముండే పెద్దనాన్న వద్ద ఉంటూ స్కూల్‌కు వెళ్తున్నది. రోజులాగే గురువారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండగా జీవదాన్ స్కూల్ వద్దకు రాగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమీపంలోని పాఠశాల ఉపాధ్యాయులు గమనించి సీపీఆర్ చేసి, దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటుతో విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. శ్రీనిధి మృతితో పాఠశాలలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ప్రభుత్వంపై సొంత ఎమ్మెల్యేల్లోనే అసంతృప్తి

- ఎమ్మెల్యేల వరుస రహస్య సమావేశాలు
- కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తిగా ఉన్నారని, వాళ్లంతా వరుసగా రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న 10 మంది ఎమ్మెల్యేలు హోటల్‌లో రహస్య మీటింగ్ పెట్టుకోగా, నిన్న మరో 10 మంది ఓ ఫాంహౌజ్‌లో సమావేశమయ్యారని తెలిపారు. అందుకే ముందు సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. కులగణన తప్పుల తడకగా ఉన్నదని ఆరోపించారు. రాజలింగమూర్తి హత్యపై విచారణ చేయకముందే ఆరోపణలు చేయడమేమిటని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు.

హత్యను బీఆర్‌ఎస్‌కు అంటగడదాం!

- కాంగ్రెస్ నేతల కుయుక్తులు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లక్ష్యంగా అడ్డదారులు
- నిస్సిగ్గుగా ముగ్గురు మంత్రుల మీడియాలో లీకులు
- బీఆర్‌ఎస్‌కు ఆపాదించేలా రాయాలని చెప్పిన వైనం
- సీఎంపీఆర్వో ఆఫీసు నుంచీ కావాలనే లీకులు?
- భూవివాదమే కారణమంటూ పోలీసుల ఎఫ్ఐఆర్
- హత్యపై మంత్రి కోమటిరెడ్డి అత్యుత్సాహం

రాజలింగమూర్తి మృతికి కారణంగా భావిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వివాదాస్పద భూమి ఇదే

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): భూతగాదాలతోనే రాజలింగమూర్తి హత్య జరిగినట్టు తెలుసు.. మృతుడి భార్య ఫిర్యాదుతో ఐదుగురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయమూ విదితమే.. భూతగాదాలే హత్యకు కారణమని స్వయంగా డీఎస్పీ చెప్పిన విషయమూ బహిరంగమే.. హత్యకు సంబంధించి వాస్తవాలన్నీ తెలుసు.. కానీ రాజకీయం చేయాలి.. బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయాలి.. ఇదీ అధికార కాంగ్రెస్ నేతల కుట్రలు, కుతంత్రాలు. పాలనలో విఫలమైందనే విమర్శలను కప్పిపుచ్చుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు తెగబడుతున్నది. భూతగాదాల నేపథ్యంలో జరిగిన రాజలింగమూర్తి హత్యను రాజకీయం చేస్తున్నది. ఈ హత్యను బీఆర్‌ఎస్‌పైకి నెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు లక్ష్యంగా పావులు కదుపుతున్నది. ఇందులో భాగంగానే మంత్రులు మొదలు సీపీఆర్వో ఆఫీసు వరకు అంతా కలిసి మీడియాకు తప్పుడు సమాచారం అందిస్తూ లీకులు ఇస్తున్నట్టుగా తెలుస్తున్నది. సోషల్ మీడియాలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గురువారం జరిగిన ఓ మీడియా సమావేశంలో స్వయంగా ముగ్గురు మంత్రులు నిస్సిగ్గుగా హత్యా రాజకీయాలకు పాల్పడడం గమనార్హం. రాజలింగమూర్తి హత్యను బీఆర్‌ఎస్‌కు ఆపాదించేలా కథనాలు రాయాలనే విధంగా విలేకరులకు సూచించడం గమనార్హం. 'రాజలింగమూర్తి హత్యపై మీరంతా దృష్టిపెట్టాలి. ఇందులో కేసీఆర్, కేటీఆర్ ప్రమేయం ఉన్నట్టు ఆ కుటుంబమే చెప్తున్నది.' అంటూ పరోక్షంగా సంకేతాలివ్వడం గమనార్హం. సుమారు 25 నుంచి 30 మంది విలేకరులు ఉన్న సమావేశంలోనే బహిరంగంగా మంత్రులు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంటే సదరు మంత్రులు, ప్రభుత్వం ఈ హత్యను బీఆర్‌ఎస్‌పైకి నెట్టేందుకు ముందుస్తు ప్లాన్‌తో ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిజాలు దాచేసి.. బీఆర్‌ఎస్‌పై నిందలు

నిజాలు ప్రపంచానికి తెలిసేలోగా ఎలాగైనా సరే రాజలింగమూర్తి హత్యను బీఆర్‌ఎస్‌కు అంటగట్టాలనే కుతంత్రంతో కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారానికి తెరతీసింది. హత్య జరిగిన మరుక్షణం నుంచే బీఆర్‌ఎస్‌పై తప్పుడు ప్రచారం మొదలుపెట్టింది. ఈ హత్యను బీఆర్‌ఎస్‌కు ఆపాదించేలా అటు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ఊపందుకున్నది. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే ఓ ప్రభుత్వ ఉద్యోగి విలేకరులు ఉన్న వివిధ వాట్సప్ గ్రూపుల్లో ఏకంగా పోస్టులనే పెట్టారు. బీఆర్‌ఎస్ హత్య చేయించిందనే విధంగా ప్రచారంచేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సైతం బీఆర్‌ఎస్‌పై నెపం నెట్టే ప్రయత్నంచేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియాలో అయితే హద్దు, అదుపు లేకుండా అసత్య ప్రచారాన్ని వ్యాప్తిచేశారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు ఇలా అంతా మూకుమ్మడి దాడికి దిగారు.

ఏకంగా మీడియా ఆఫీసులకే ఫోన్లు?

నిజాలకు పాతరేసి పచ్చి అబద్ధాలను వల్లెవేశారు. దీనికితోడు ప్రభుత్వం నుంచి సీపీఆర్వో ఆఫీసు కూడా రంగంలోకి దిగినట్టుగా సమాచారం. ఈ హత్యకు సంబంధించి వివిధ మీడియా చానళ్లకు, పత్రికా కార్యాలయాలకు ఫోన్లు చేసి సమాచారం ఇచ్చినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడిగడ్డ కేసును బూచిగా చూపుతూ రాజలింగమూర్తి హత్యలో బీఆర్‌ఎస్‌ను ముద్దాయిగా నిలిపే విధంగా కథనాలు రాయాలని సూచించినట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే గురువారం వివిధ పత్రికలు, చానళ్లలో తాటికాయంత అక్షరాలతో తప్పుడు కథనాలను వండివార్చారు. ఇందులో ప్రధానంగా బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ కథనాలు రాయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా రాజలింగమూర్తి హత్యకేసులో బీఆర్‌ఎస్‌ను ముద్దాయిగా నిలిపేందుకు తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా తప్పుడు ప్రచారానికి పూనుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి కోమటిరెడ్డి అత్యుత్సాహం

భూపాలపల్లిలో జరిగిన రాజలింగమూర్తి హత్యకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించి విమర్శలకు గురయ్యారు. గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ అసత్యాలు చెప్పి తన స్థాయిని తగ్గించుకున్నారనే విమర్శలు వచ్చాయి. కనీస సమాచారం తెలుసుకోకుండా, నిజానిజాలు బేరీజు వేసుకోకుండా ఓ చిన్న కార్యకర్తలా మంత్రి ఇష్టారీతిగా మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ హత్యను ఏ విధంగానైనా బీఆర్‌ఎస్‌కు ఆపాదించాలనే కుతూహలంతో ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థంకాకుండా మాట్లాడారంటూ జనం విస్తుపోతున్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడడాని కంటే ముందే మృతిడి భార్య ఐదుగురి వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. అప్పటికే పోలీసులు కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మాత్రం ఈ నిజం తెలియలేదు. ఈ హత్య విషయం తెలియగానే తమ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేనే. అంటే ఓ మంత్రి ఫోన్ చేస్తే సొంత పార్టీ ఎమ్మెల్యేనే స్పందించని దౌర్భాగ్యం ఉండటం గమనార్హం. ఒక మంత్రిగా స్థానిక ఎస్సైకి, డీఎస్పీకి, ఎస్పీకి ఫోన్ చేస్తే అసలు నిజాలు చెప్పేవారు కదా... ఆ మాత్రం కూడా మంత్రికి తెలియదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా మంత్రి కోమటిరెడ్డి తన స్థాయిని మరిచి అబద్ధాలను మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్ఐ ఏం చెప్పారు

భూమికి సంబంధించి 10 ఏండ్లుగా వివాదం ఉన్నది. ఇందులో భాగంగానే రాజలింగమూర్తి హత్య జరిగినట్టు ఫిర్యాదు అందింది.' ఇదీ భూపాలపల్లి ఎస్సై చెప్పిన మాట.

హతుడి భార్య ఫిర్యాదులో ఏమున్నది?

'భూమికి సంబంధించి రేణుకుంట్ల కొమురయ్య, రేణుకుంట్ల సంజీవ్ కుటుంబంతో తగాదా నడుస్తున్నది. అందుకే బైక్‌పై వెళ్తున్న నా భర్తను అడ్డుకొని రేణుకుంట్ల సంజీవ్, పింగిళి శ్రీమంత్, మోరె కుమార్, కొత్తూరి కుమార్, కొమురయ్య అనే వ్యక్తులు హత్య చేశారు' ఇదీ మృతుడు రాజలింగమూర్తి భార్య సరళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు. ఈ మేరకు పైఐదుగురిపై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది.

అసత్య ప్రచారం

వాస్తవాలు ఇలా ఉంటే కాంగ్రెస్ నేతలు, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు పలువురు బీఆర్‌ఎస్ నేతలపై నెపం నెట్టే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే మేడిగడ్డపై కేసు వేశారనే కోపంతో బీఆర్‌ఎస్ నేతలే హత్య చేయించారంటూ అసత్య ప్రచారానికి తెగబడ్డారు.

పోలీసుల అదుపులో ఇద్దరు?

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. ఆ ఘటనకు సంబంధించి రేణుకుంట్ల కుటుంబానికి చెందిన ఇద్దరిని పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హత్య జరిగిన స్థలంలో గురువారం క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఘటనా స్థలం వద్ద సంచిలో ఉన్న కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారి కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. అదుపులో ఉన్న వారి నుంచి సమాచారం సేకరించిన పోలీసులు కాల్‌డేటాతో విచారణను ముమ్మరం చేశారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో హత్య జరిగిన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

లింగమూర్తి హత్యతో సంబంధం లేదు

- కావాలనే కాంగ్రెస్ నేతల తప్పుడు ఆరోపణలు
- భూ వివాదంతోనే హత్య జరిగిందని ఎఫ్ఐఆర్
- సీబీఐతో విచారణ చేయించండి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతిభ్రమించి మాట్లాడిండు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): భూపాలపల్లిలో జరిగిన రాజలింగమూర్తి హత్యతో తనకు గానీ, తమ పార్టీకి గానీ ఎలాంటి సంబంధమూ లేదని బీఆర్‌ఎస్ నేత, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. కావాలనే కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియా వేదికలపై తమ పార్టీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లింగమూర్తి హత్యను స్థానిక మాజీ ఎమ్మెల్యేగా తాను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్‌ఎస్ నేత యాకూబ్‌రెడ్డితో కలిసి గండ్ర మీడియాతో మాట్లాడారు. లింగమూర్తి హత్య అనంతరం వాస్తవాలు తెలుసుకోకుండానే కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, బట్ట కాల్చి మీదేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ హత్యను బీఆర్‌ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు ఆపాదించాలని శతవిధాలా ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక భూవివాదం నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని మృతుడి భార్య ఫిర్యాదు చేశారని, ఆ మేరకే ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని చెప్పారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్ కాపీని మీడియాకు చూపారు. ఆ తర్వాత కొందరి ఒత్తిళ్లతో, ప్రేరేపించడంతో రాజలింగమూర్తి భార్య తనపై ఆరోపణలు చేశారని తెలిపారు.

న్యాయపరంగా ఎదుర్కొంటాం

రాజలింగమూర్తి హత్యపై సీబీసీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నారని, సీబీఐతో విచారణ జరిపించినా తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని వెంకటరమణారెడ్డి స్పష్టంచేశారు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని, దానిని న్యాయపరంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. మృతుడిపై భూవివాదాల ఆరోపణలతోపాటు రౌడీషీట్ కూడా ఉన్నదని తెలిపారు. బీఆర్‌ఎస్‌పై, తనపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ హత్యలో అరెస్టయిన వ్యక్తుల పేర్లతో రాజలింగమూర్తి గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆ ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారని, విచారించి నిజానిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిష్పాక్షిక విచారణ జరిపి దోషులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు.

హత్యా రాజకీయాలు కాంగ్రెస్‌కే అలవాటు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతిభ్రమించిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. హత్యా రాజకీయాలు కాంగ్రెస్‌కే అలవాటని, బీఆర్‌ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని స్పష్టంచేశారు. నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌ను హత్య చేశారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై కోమటిరెడ్డి ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. వేముల వీరేశం ఇప్పుడు కాంగ్రెస్‌లోనే ఉన్నారని చెప్పారు. కోమటిరెడ్డి పూటకో మాట మాట్లాడతారని, ఆయన ఏం మాట్లాడుతరో ఆయనకే తెలియదని మండిపడ్డారు. ఇప్పటికైనా కుటిల రాజకీయాలు మానుకుంటే మంచిదని హితవుపలికారు.

ఇద్దరిని హత్య చేసిన మావోయిస్టులు

- ఇన్ఫార్మర్లనే అనుమానంతో దారుణం
- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 20: పోలీసులకు సమాచారం ఇస్తున్నారని ఆరోపిస్తూ ఓ విద్యా వలంటీర్‌తోపాటు గ్రామస్తుడిని మావోయిస్టులు హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో ఈ ఘటన జరిగింది. బర్సూర్ తహసీల్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. దంతెవాడ జిల్లా తొడ్మ గ్రామానికి చెందిన విద్యా వలంటీర్(శిక్షాదూత్) బామన్ కశ్యప్(28), అదే గ్రామానికి చెందిన అనీష్‌రామ్ పోయం(38)లను బుధవారం సాయంత్రం మావోయిస్టులు అపహరించుకెళ్లారు. తర్వాత అదే గ్రామ సమీపంలో వారిద్దరినీ హత్య చేశారు.